మన ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాఖ అధ్యక్షులుగా కుమార్ నాయక్

విశాలాంధ్ర - పలాస : మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాఖ అధ్యక్షులుగా రంగస్థలం, సినీ నటుడు కుమార్ నాయక్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. రాష్ట్ర అధ్యక్షులు జే.ఎన్.రాజేంద్ర ఆదేశాల మేరకు జిల్లా శాఖ 2024-25 వార్షిక సంవత్సరానికి మంగళవారం నూతన కార్యవర్గమును పలాస చంద్రశేఖర ఆలయం ఆవరణలో ఎన్నుకోవడం జరిగిందని కుమార్ నాయక్ తెలిపారు. గౌరవాధ్య క్షులుగా డాక్టర్, తెప్పల కృష్ణ మూర్తి, ప్రధాన కార్య దర్శిగా డి.ఏ. స్టాలిన్, కోశాధికారిగా బమ్మిడి. కృష్ణా రావు, ఉపా ధ్యక్షులుగా మద్దు. ఈశ్వరమ్మ, సంయుక్త కార్య దర్శులుగా తోట.సింహాచలం, సారక.మోహన్ రావు, సహాయ కార్య దర్శులుగా బమ్మిడి. రుక్మంగధరరావు, తంగి. శోభారాణి, ఈసీ మెంబర్లుగా ఏడుగురుని ఎన్నుకున్నామని అధ్యక్షులు కుమార్ నాయక్ తెలిపారు.

ఆగష్టు 29న వ్యవసాయ యాంత్రీకరణ మేళా

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఆచార్య యన్. జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయము, వ్యవసాయ పరిశోధనా స్థానము రాగోలు లో పరిశోధన సహ సంచా లకులు, ఉత్తర కోస్తా మండలం వ్యవసాయ పరిశోధనా స్థానం, రాగోలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఆగస్టు 29 గురువారం వ్యవసాయ యాంత్రీకరణ మేళా నిర్వహించనున్నట్లు ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డా. పి.వి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి 9.30 గంటల వరకు పేర్లు నమోదు చేయనున్నారు. అనంతరం 9.30 గంటలకు క్షేత్ర సందర్శనతో కార్యక్రమం ప్రారంభం కానున్నది. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 01.00 గంట వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన, వ్యవసాయ క్విజ్, రైతు సదస్సు గౌరవ అతిథుల ప్రసంగాలు వ్యవసాయ ప్రచురణల విడుదల. భోజన విరామం అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన, రైతులతో శాస్త్రవేత్తల చర్చా గోష్ఠి జరుగు తుందన్నారు. ఈ సదా అవకాశాన్ని రైతులందరూ వినియోగించు కొవాలన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

విశాలాంధ్ర - పలాస/వజ్రపు కొత్తూరు : నిబంధనలు పాటించని చిల్డ్రన్ హెూమ్ లపై చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొబేషన్ అధికారి బీవీ రవికుమార్ అన్నారు. మంగళవారం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ సంచాలకులు మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలాసలో గల చిల్డ్రన్ హెూమ్, గరుడ భద్ర లో గల మిరియం చిల్డ్రన్ హెూమ్, బాలల రక్షిత గృహాలను మరియు లలిత చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంను జిల్లా పరిశీలన బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం,2015 మరియు నిబంధనలు, 2016 ప్రకారం బాలల గృహాలను తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని వాటిని మూసివేయడం జరుగుతుందన్నారు. నిబంధనలు పాటించని బాలల అక్షిత గృహాలపై జిల్లా కలెక్టర్ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పరిశీలన కమిటీలో డిసిపిఓ కె.వి.రమణ, లోకల్ సిడిపిఓ వై.లావణ్య గారు, పిఓఐసి మెట్ట మల్లేశ్వరరావు, పిఓ ఎన్ఐసి ఐ.లక్ష్మీనాయుడు ఎల్పిపిఓ టి .లక్ష్మణరావు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - పలాస : విద్యార్థులు దిన చర్యలో భాగంగా ప్రతీ రోజు వ్యాయామం అలవర్చుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.వెంకట లక్ష్మీ అన్నారు. మంగళవారం పలాస డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య జీవన విధానంలో భాగంగా ప్రతీ రోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి ఆరోగ్య భారతదేశంలో పునాదులు వెయ్యాలన్నారు. కార్యక్రమంలో పి డి డాక్టర్ మధు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి ఉపాధ్యాయులు ప్రసాద్ గోవింద్ కోదండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పై విచారణ.. అక్రమాలు రుజువైతే చర్యలు

విశాలాంధ్ర - ఆమదాలవలస : కొత్తవలస ఉపాధి హామీ ఫీల్డ్ అసి స్టెంట్ అనేక అక్రమాలకు పాల్పడడంతో పాటు తప్పుడు విద్యార్హతల ధ్రువీకరణ అందించి ప్రభుత్వాన్ని మోసం చేసి విధులు నిర్వహిస్తున్నారని స్థానిక గ్రామస్తుల తోపాటు కూటికు ప్పల సురేష్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును దర్యాప్తు నిర్వహించాలని డ్వామా పిడికి అందించడంతో మంగళవారం గ్రామస్తులు వేత న దారులు ఫిర్యాదు దారు స మక్షంలో విచారణ అధికారి ఏపీడి లోకేష్ ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో లక్ష్మి నరసమ్మ గ్రామ కార్యదర్శి పి రాము ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఫిర్యా దులో ఉన్న అంశాలను ఫిర్యాదుదారులను అడిగి తెలుసు కున్నారు. వారిచ్చే వివరాలను రికార్డ్ చేశారు. విచారణ ఎదుర్కొంటున్న బొడ్డేపల్లి వెంకట రమణ సమక్షంలో అధికారు లు గ్రామస్తులను వేతనదారు లను వివరాలు అడిగి వారి పేర్లతో నమోదు చేశారు. ఇటీ వల కాలంలో తప్పుడు మస్ట ర్లు వేసి ఉపాధి నిధులను దోచుకున్నారని ఆరోపించారు. జాబు కార్డులను వారికి నచ్చిన వారికి ఇస్తూ మిగిలిన వారికి అందించలేదని కొంతమంది విచారణ అధికారుల ముందు వివరించారు. జాబు కార్డు అడి గితే దిక్కున్న చోట చెప్పుకోవాలని పరుష పదజాలలతో దూషించేవాడని విచారణ అధికా రుల ముందు వివరించారు. అలాగే తప్పుడు ధృవీకరణ పత్రంతో విధులు నిర్వహిస్తు న్నాడని ఆరోపించారు. పను లు చేయకుండానే కొంతమంది ఖాతాల్లో డబ్బులు పడుతు న్నాయని పనిచేసిన వారి ఖా తాల్లో కనీసం సగం డబ్బులు కూడా పడటం లేదని వేతన దారులు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనదారుల శ్రమను ప్ర భుత్వ ధనాన్ని దోచుకోవ డమే కాకుండా తప్పుడు పత్రాలతో ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారని వివరించారు. ముఖ్యంగా పని కి తగిన వేతనం అందడం లేద ని మా శ్రమను సైతం దోచుకుం టున్నారని వారు నిలదీశారు. ప్రభుత్వ ధనాన్ని దోచుకోవడంతో పాటు ఉపాధి కూలీల శ్రమను దోచుకుని ఫీల్డ్ అసిస్టెంట్ లబ్ధి పొందారని విచారణ అధి కారుల ముందు వివరించారు. ఆధ్యాంతం గ్రామస్తులు ఫిర్యా దుదారుల మధ్య వివాదం నెలకొన్నప్పటికీ పోలీసులు వారిని వారించారు. ఒక దశలో ఇరు వర్గాల మధ్య వాదోపవా దాలు తారాస్థాయికి చేరాయి పోలీసులకు కలుగజేసుకొని సమస్యల సాధ్యమని ఎలా చేశారు. ఈ విషయమై విచారణ అధికారి ఉపాధి హామీ ఏపీ డి లోకేష్ ను వివరణ కోరగా ఫిర్యాదుల పేర్కొన్న అంశాలు వారీగా ఫిర్యాదుదారులతో వాంగ్మూలం తీసుకున్నామని సర్టిఫికెట్ విషయమై ఒరిజినల్స్‌ని తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చామని, తెచ్చిన తర్వాత సర్టిఫికెట్ పరిశీలించి నిర్ధారణ చేసి ఆరోపణ రుజు వైతే తగు చర్యలు తీసుకుంటా మని ఏపీడి స్పష్టం చేశారు.

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక జిల్లా ఆసుపత్రి ఆవరణంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఈఎంటి లకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఓఈ రంగప్రసాద్ ల పర్యవేక్షణలో ఆన్ జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ తరగతులు నిర్వహించారు. అత్యవసర, పిడియాట్రిక్ ఎమర్జెన్సీ మెడికల్ వైద్య సేవల గురించి వివరిస్తూ ఇటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో అలాగే ఎటువంటి మందులు ఇవ్వాలో అనే వాటిపై క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్ లలో పనిచేస్తున్న సుమారు 30 మంది ఈఎంటీలు శిక్షణ పొందారు.

మూగజీవాలకు ముందస్తు వాక్సిన్‌లు

విశాలాంధ్ర - టెక్కలి : మండ లంలో రావివలస పంచాయతీ చిన్న నారా యణపురం గ్రామంలో మూగజీవాలకు జబ్బులు రాకుండా ఉండడానికి ముందస్తు వాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ తనూజా గ్రామంలో ఉన్న ఆవులకు, గేదెలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగజీవాలకు సీజనల్ జబ్బులు రాకుండా ఉండేందుకు ముందస్తు వ్యాక్సిన్లు వేస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా యాదవ సాధికార కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్, దాసరి వాసుదేవ్, దాసరి శ్రీనుబాబు,తురక కృష్ణారావు, మురపాల అప్పారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభివృద్దే లక్ష్యం : దేవలూటి శంకర్

విశాలాంధ్ర - రణస్థలం : ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పదవ తరగతి లో మెరిట్ సాధిస్తున్న రజక, పేద విద్యార్థులకు, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యా సంక్షేమ సంఘం తరఫున అనేక సేవలు అందిస్తున్నామని ఇక నుండి కూడా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్టాలలో రజక విద్యా సేవా సంక్షేమ సంఘం తమ సేవలను రెండు తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విస్తరింప చేస్తామని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు దేవలూటి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రజకులు అనేక ప్రాంతాల్లో జిల్లాలలో వెనుకబడి ఉన్నారని, తల్లిదండ్రులు లేని పిల్లలు, పేదరికం కారణంగా ఉన్నత విద్యలు చదువుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి విద్యార్థులకి సంస్థ చేయూతని అందిస్తుందని పూర్తి సమాచారం కోసం 80966 46072, 6304330 529 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇల్లు నిర్మాణాలు త్వరితంగా పూర్తి చేయాలి కమిషనర్ బాలాజీ ప్రసాద్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ప్రభుత్వం మంజూరు చేసిన లే అవుట్ లో ఇళ్ల నిర్మాణం త్వరి తగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం హౌసింగ్ సచివాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హౌ సింగ్ లే అవుట్లలో ఇండ్ల నిర్మాణాలను లక్ష్య నిర్దేశం మేరకు సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. గాజుల కొల్లివలస జోన్ 1,2, లలో హౌసింగ్ పురో గతి పై ఏ.ఈ డి.సన్యాసిరావు, వార్డు సచివాలయాల ఎమిని టీస్ కార్యదర్శులతో సమీక్షించారు. లే అవుట్ల వారీగా పరి స్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్య సాధనకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇది ఇలా ఉండగా హౌసింగ్ నిర్మా ణాల్లో జరుగుతున్న జాప్యానికి కారణాలు అడిగి తెలుసుకు న్నారు. సత్వరమే లబ్ధిదారు లకు తగిన సహకారం అందిం చాలని సిబ్బందికి సూచించారు

మండల స్థాయి స్కూల్ గేమ్స్, గ్రిక్స్ పోటీలపై సమావేశం

విశాలాంధ్ర - టెక్కలి : మండలలో స్థానిక రీసెర్చ్ సెంటర్ (ఎంఆర్సి) వద్ద మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్, గ్రిక్స్ పోటీలు పై మండల విద్యాశాఖ అధి కారులు తులసీరావు, చిన్నారావు ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9 నుండి 12వ తేదీ వరకు మండల స్థాయి గ్రిక్స్ పోటీలు నిర్వహిస్తూ స్కూల్ గేమ్స్ పోటీలకు సెలక్షన్లు నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారులు సూచనలు ఇచ్చారు. ఈ మండల స్థాయి పోటీలు 9వ తేదీన కబడ్డ జడ్పీహెచ్ఎస్ బురాగాం, 10వ తేదీన వాలీబాల్ జడ్పీహెచ్ఎస్ లింగాలవలస, 11వ తేదీన ఖోఖో జడ్.పి.హెచ్.ఎస్ పోలవరం, 12వ తేదీన బ్యాడ్మింటన్, టెన్నికుట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి ఇన్చార్జ్ బాడాన నారాయణరావు, మండల స్పోర్ట్స్ ఆఫీసర్ కేకే రామరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సారవకోట సబ్ ఇన్స్పెక్టర్ అనిల్

విశాలాంధ్ర - జలుమూరు : శ్రీకాకుళం జిల్లా సూపర్ అంట పోలీస్ కేవీ మహేశ్వర్ రెడ్డిని సారవకోట మండల సబ్ ఇన్స్పెక్టర్గా నూతన బాధ్యతలు చేపట్టిన అనిల్ కుమార్ గౌరవంగా మంగళవారం ఎస్పీని కలిసి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి గాప్రజల కోసం పూర్తి బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పి సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనను గ్రామాల్లో జరగకుండా చూడాలని అనిల్ కుమార్ కు ఎస్పి సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఏపీ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ (ఐఏఎస్) అధికారిణి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలో స్థానిక జిల్లా ఆసుపత్రిని మంగళవారం ఏపీ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ (ఐఏఎస్) అధికారిణి అట్టడ సిరి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, ఓపి, సిటీ స్కాన్ ఇలా మరికొన్ని వార్డు లను వైద్యులతో పాటు పరిశీలించారు. ఓపి రిజిస్టర్, గర్భిణీలు రిజిస్టర్, వైద్యుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించి, ఫీవర్ సర్వే, ఫీవర్ క్యాంపులు నిర్వహించాలని, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం, ఆస్పత్రిలో ఉన్న రోగులకు అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశు భ్రంగా ఉంచాలని వైద్యులకు ఆమె ఆదేశించారు. ఈ తనిఖీలలో వైద్యులు, సూపర్వైజర్లు, స్టాఫ్ నర్సులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజలకు సురక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

పైపులైన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : నియోజకవర్గంలోని ప్రజలందరికీ వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా సురక్షితమైన, తగినంత తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మండలంలోని బందరువానిపేటలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు అందించి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని చెప్పారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు విస్మరించిందన్నారు. పల్లెల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామ న్నారని చెప్పారు కానీ చేతల్లోకి వచ్చేసరికి దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. జలజీవన్ మిషన్ పథకం పనులను అటకెక్కించారని, ఐదేళ్లు పనులను సాగదీశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలజీవన్ పథకంపై పల్లె ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయన్నారు. ఎన్నికల మందు కూటమి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం బందరువానిపేట గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు సాదారంగా విన్నారు. అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ఎమ్మెల్యే శంకర్ గ్రామస్తులకు హామీనిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'గురుగుబెల్లికి' అబ్దుల్ కలాం సేవ రత్న అవార్డు

విశాలాంధ్ర - ఆమదాలవలస : చేయూత సోషల్ సర్వీస్ ఆర్గ నైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గురుగుబెల్లి రామ మోహనరావు కు ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ సేవా రత్న అవార్డును పబ్లిక్ లైబ్రరీ విశాఖపట్నం లో సోమవారం సాయంత్రం అం దించారు. డే స్ప్రింగ్ ఇంటర్నే షనల్ యూనివర్సిటీ యూఎస్ ఏ, ఇండియా ఆధ్వర్యంలో అ వార్డులను ప్రధానం చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ ఆమోస్ జేమ్స్, ఫౌండర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ వైయస్ చిన్నారావు, న్యూ మా సినీ డైరెక్టర్ గుప్త, చీఫ్ గెస్ట్ డాక్టర్ జి దామోదర్ రావు లు అవార్డు ప్రదానం చేసి రామ్మోహన్ రావు సత్కరించారు. వృత్తిలో ఉత్తమ సేవ ప్రతిభను అందిం చిన వారికి డే స్ప్రింగ్ యూని వర్సిటీ అవార్డులను ప్రధానం చేస్తుంది. రామ్మోహన్ రావు మండలంలోని చీమల వలస గ్రామం. వృత్తి రీత్యా పలాస ఏపీఎస్ ఆర్టీసీ లో సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నారు. ఈయనకు ఇటీవలే డాక్టరేట్, అబ్దుల్ కలాం జాతీయ సేవా అవార్డు, తోపాటు ఇటీవల జ రిగిన ఆర్టీసీ సంస్థ నిర్వ హిం చిన ఆటల పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపి కయ్యారు. ఈయన ప్రతిభ కు ఆర్టీసీ అధికారులు సన్నిహి తులు అభినందనలు తెలిపారు.

ఆదివాసి కుటుంబాలను ఆదుకుంటా : ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

విశాలాంధ్ర - జలుమూరు : శ్రీకాకుళం జిల్లాలో అనేక మారుమూల గ్రామాల్లో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆదివాసి గిరిజన సోదర కుటుంబాలను ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఆదుకుంటానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆదివాసి కుటుంబాలకు హామీ ఇచ్చారు. మంగళవారం జలుమూరు, హిరమండలం మండలాల్లో విస్తృత పర్యటన సాగించారు. కమిషన్ చైర్మన్ సభ్యులు ఇచ్చిన ధైర్యంతో ఆదివాసులు ఆనందపడ్డారు. జెమిని వలసలో భూకామాంధులు గిరిజనులకు ఇబ్బంది పెడితే భవిష్యత్తులో ఇబ్బంది పడతారని ఆయన సూచించారు. గిరిజనులు వివరించిన సమస్యలపై చైర్మన్ సభ్యులు స్పందించారు. కనీసం స్మశానం, పాఠశాల లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇది అన్యాయమని ఇక్కడ ఇస్కాన్ సంస్థ ఏర్పడి హరే రామ హరే కృష్ణ పేరుతో దోపిడీ చేస్తున్నారని, రాజ్యాంగపరంగా ఉన్న గిరిజన భూములను దోచుకుంటున్నారని అన్నారు. కనీసం బహిర్భూమికి వెళ్ళడనికి మహిళలు ఇబ్బందులు పడున్నారని, గిరిజనులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా దానిపై చర్యలు తీసుకుంటానని సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర ఆదివాసి సంఘ నాయకులు వాబయోగి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా వారసత్వాన్ని భావితరాలకు అందించాలి

విశాలాంధ్ర - టెక్కలి : తెలుగు భాష వారసత్వాన్ని భావితరాలకు అందించాలని టెక్కలి డివిజనల్ విద్యా శాఖాధికారిణి పగడాలమ్మ అన్నారు. ఈ సందర్భంగా మండలంలో రావివలస గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష వారోత్సవాల ముగింపు మరియు తెలుగు భాష దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి భారత్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారు తెలుగు యొక్క గొప్పతనాన్ని గుర్తించి తెలుగు కీర్తిని వ్యాపింప చేయాలని ఆకాంక్షించారు. గిడుగు రామమూర్తి మంచి వ్యవహారిక భాషావేత్తని, వారు మన ప్రాంతానికి చెందడం మన అదృష్టమని అన్నారు. అనంతరం, మండల విద్యాశాఖ అధికారి దల్లి తులసీ రెడ్డి మాట్లాడుతూ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ గురించి వివరిస్తూ అటువంటి క్రీడాకారులు మన దేశంలో పుట్టడం అదృష్టం అని కొనియాడారు. అలాగే మార్పు నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతము ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పాఠశాల విద్యార్థి కే జయరాం చేసిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్ర అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గణపతి ని డిప్యూటీ డీఈవో, ఎంఈఓ చేతులు మీదగా సత్కరించారు. పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అలివేణి నారాయణమూర్తి, మురళీకృష్ణ, మోహిని, వనజాక్షి, భాస్కరరావు, ప్రకాష్ రావు, గణపతి, శ్యామలరావు రామారావు, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సిల్ట్ తొలగింపు

విశాలాంధ్ర - ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలో పేరుకుపోయిన చెత్తను రెండు రోజులుగా తరలిస్తున్నారు. మురుగు నీటి కాలువలు పూర్తిగా కూరుకుపోవడంతో వాటి లోని సిల్ట్ ని కూడా తొలగిస్తున్నారు. పురపాలక సంఘ శానిటేషన్ సిబ్బందితోపాటు సచివాలయాల సానిటరీ కార్య దర్శులు పనులు పరిరక్షణ చేస్తూ పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. ప్రధాన డ్రై నేజీల వద్ద ఎక్కువగా చెత్త పే రుకు పోతుంది. కొంతమంది ఆక్రమణదారులు మురుగు నీటి కాలువలను కూడా ఆక్రమ ణ చేయటంతో ఆయా ప్రాంతా ల్లో వర్షం పడితే చాలు రోడ్లపై నీరు చేరుతుంది. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో తొలగించి స్వే చ్ఛా మునిసిపాలిటీగా తీర్చిది ద్దడమే లక్ష్యంగా పనులు చేస్తు న్నట్లు సానిటరీ ఏ ఈ బి సృజ న తెలిపారు. ఇటీవల పట్టణం లోని పారిశుధ్య నిర్వహణ ప నులకు సుమారు 29. 4 లక్షల వరకు ఎన్ డి ఏ కూటమి ప్రభు త్వం మంజూరు చేసిందని తెలిపారు. పట్టణ పారిశుద్ధ సిబ్బంది, సచివాలయ సాని టరీ అధికారులు సాంకేతిక అధికారి గుత్తేదారులు కలసి కట్టుగా పనులను పరిరక్షణ చేస్తున్నారు. పట్టణంలోని 23 వార్డు పరిధిలో ఉన్న చెత్తను తొలగించ నున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన ఆముదాల వలస నిర్మాణానికి ప్రజల సహ కరించాలని కోరారు.

విద్యతో పాటు వినయం చాలా అవసరం

రిటైర్మెంట్ ప్రిన్సిపాల్ పి.రాంబాబు

విశాలాంధ్ర - హిరమండలం : మండల కేంద్రమైన హిరమండలం పెద్ద కోరాడ లోని శ్రీరామ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే మంగళవారం విద్యార్థులు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పదవి విరమణ పొందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇంటర్మీడియట్ స్థాయి నుండి క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి ఉండాలని, ఆంగ్ల విద్యపై పూర్తిస్థాయిలో పట్టు సాధించినప్పుడే పోటీ పరీక్షలలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, మొబైల్ ఫోన్స్ కు దూరంగా ఉండాలని, మంచి వారితో స్నేహ సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి ఈ ఎస్ పట్నాయక్, ఒకేషనల్ అధ్యాపకులు ఏవి బుచ్చబ్బాయి, కళాశాల కరస్పాండెంట్ రెడ్డి గోపాల్ రావు మాస్టర్, ప్రిన్సిపాల్ శాంతారావు, ఏవో జి సురేష్, మేనేజ్మెంట్ సభ్యులు కే సీతారాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్ద పెద్ద భవనాలు కడుతున్న కన్నెత్తి చూడని అధికారులు

మీకోసంలో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : కుక్కని చంపాలంటే పిచ్చికుక్కని ముద్ర వేసి చంపితే నేరం కాదు అన్నట్టు ఉంది ఎచ్చెర్ల మండలంలో ఉన్న దుప్పలవలస రెవెన్యూ గ్రామం 97 సర్వేనెంబర్ చెరువు పరిస్థితి. ఈ చెరువు పూర్వకాలంలో రెవెన్యూ విలేజ్ మ్యాప్ లో చెరువుగా ఉండడం స్థానిక ప్రజలు త్రాగునీటికి వాడుకొని ఉండేవారు. కొంతకాలం క్రితం కొందరు రెవెన్యూ రికార్డు మార్పిడి చేసి కొంత చెరువు భూమిని పంట పండించేందుకు ఉపయోగంచే వారు. ఇది ఇలా ఉండగా ఆ చుట్టుపక్కల భూముల రేటుకు రెక్కలు రావడం తో అమాంతం కోట్లకు రేట్లు పెరిగాయి. అప్పుడు ఆ చెరువుభూమిపై కొందరి కన్ను పడింది. వెంటనే రంగంలోకి దిగి అర్‌వీఎం లో ఉన్న చెరువు భూమిని వెబ్సైట్ అడంగల్‌లో పొందుపరిచి జిరాయితీ భూమిగా మార్చదానికి ప్రయత్నాలు మొదలయ్యాయనే విమర్శలు వినపడుతున్నాయి. ఆచెరువు భూముని కాస్త జిరాయితీ భూమి గా మార్చే విధానం మొదలుపెట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు ఆ చెరువు లో ఏకంగా సుమారు రెండు ఎకరాలలో పెద్ద భవనం నిర్మా ణం సాగుతుంది దీనిపై గతంలో స్థానికులు మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ కి ఫిర్యాదు కూడా చేశారు. కానీ ఆ నిర్మాణం ఎట్టి పరిస్థి తుల్లోనూ ఆగకుండా పనులు చక చక జరుగుతున్నాయి అంటే ఆంతర్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అధికారులు, రాజకీయ నాయకులు స్వా ర్థంతో చెరువుని కబ్జా కోరల్లోకి నెట్టి పడేస్తున్నారనే వాదన వినపడుతుంది. ఇలా చెరువు భూములు ఆక్రమించుకుంటూ పోతే రాబోయే తరాలకి నీటి వసతులు కరువు అవుతాయని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సంబంధిత ఆక్రమణ చేసిన వారిపై ఉక్కు పాదం మోపుతారని స్థానికులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : వీసీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : విద్యార్థి జీవితం ఎంతో విలువైనది, ఈ దశలో మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కెఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం షే ఎన్ టూ లైఫ్- నో డ్రగ్స్ పేరిట నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ కెరీర్ల దృష్టి సారించాలన్నారు. యువత గంజాయి, మద్యపానం, ధూమపానం తదితర చెడు అలవాట్లకు బానిసైతే కెరీర్ మొత్తం పాడవుతుందని చెప్పారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ జి. పద్మారావు, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ ఎస్.అరుణకుమారి, టి.భవాని తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన గ్రామాలు... ప్రభుత్వ వైద్య సేవలు కరువు

జ్వరంతో సర్పంచ్ భర్త మృతి

విశాలాంధ్ర-పలాస/మందస : పలాస నియోజకవర్గం పరిధిలో వజ్రపుకొత్తూరు పలాస, మందస మండలాలతోపాటు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో వందలాది మంది జ్వరాలు బారినపడి అనారోగ్యంతో మంచాలు పట్టి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలతో పాటు చికెన్ గున్యా అనవాళ్లు ఉండే జ్వరాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ఉద్దానం, గిరిజన మైదాన ప్రాంత ప్రజలు వేలాది మంది బాధితులు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, సోంపేట టెక్కలి ప్రాంతాలలో ఉన్న ప్రయివేట్ ఆసుపత్రులలో చేరి వేలాది రూపాయలు ఖర్చుపెట్టి వైద్య సేవలు పొందుతున్నారు. ప్లేట్ లెట్స్ తగ్గుముఖం పట్టడం, నెలలు తరబడి కీళ్ల నొప్పులతో బాధ పడుతుండడం నడవలేని పరిస్థితుల జ్వరం బారిన పడిన బాధితులు ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలు నుండి నియోజకవర్గంలో జ్వరాలు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వ వైద్యశాఖ పట్టించు కోకుండా వైద్య శిబిరాలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యసేవలు ప్రజలు మరచిపోయే విధంగా వైద్య ఆరోగ్యశాఖ వ్యవహరిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. జ్వరం బారినపడి మందస మండలం బైరి సారంగాపురం పంచాయతీ సర్పంచ్ రట్టి సరస్వతి భర్త రట్టి లింగరాజు ఆదివారం రాత్రి పలాస లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. జ్వరం బారినపడిన బాధితులు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు వివిధ రకాల వైద్య పరీక్షలు కోసం, మందులు కొనుగోలు కోసం ఖర్చు చేస్తున్నారు ఆర్థికంగా లేని నిరుపేదలు అధిక వడ్డీలకు అప్పులు చేసి వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. వివిధ రకాల జ్వరాలు ఉద్ధృతంగా ఉండటం ఇళ్ల వద్దే ఉండి నడవలేని స్థితిలో వేలాది మంది ప్రజలు కాలం వెలదీస్తున్నారు. జ్వరాలు తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ప్రభుత్వపాలన యంత్రాంగంలో చలనం కనిపించడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. కాగా గ్రామీణ పల్లెల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. గ్రామాల్లో పారిశుధ్యత కనిపించడం లేదు పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు ఎక్కడికక్కడ చెత్త చెదారం నిండి ఉన్నాయి. కూడళ్లలో పరిశుభ్రత కరువయింది. దీనితో పల్లెల్లోని పరిసరాలు దుర్గంధభూరితంగా తయారయ్యాయి. దోమలకు నిలయంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వపరంగా వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పలాస : సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని కేసుల నుండి ఉపశమనం పొందాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి బి ఎమ్ ఆర్ ప్రసన్నలత అన్నారు. మంగళవారం పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రసన్న లత మాట్లాడుతూ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ కై తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు, పోలీస్ లు, ఎక్సైజ్ అధికారులు ప్రతీ గ్రామం లో ప్రచారం చేయాలని, గ్రామాల ప్రజలందరికి ఈ విషయం తెలిసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు అదే విధంగా పోలీస్ లు కక్షి దారులకు నోటీసులు పంపించి వారందరు రాజీకి వచ్చినప్పుడు వెంటనే కేసులు నుండి శాశ్వతం గా ఉపశమనం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జి ఎం ఎస్ అనిల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఘని, కోశాధికారి రవి, న్యాయవాదులు జి ప్రభాకర్, పియల్ నారాయణ, కాళిదాసు,సుధారాణి, ఉషారాణి,చిట్టి బాబు, కోర్ట్ కానిస్టేబుల్ నారాయణ, శ్రీను, భద్రం, ఎంపీడీఓ రమేష్ నాయుడు, పలాస, వజ్రపు కొత్తూరు తహసీల్దార్ లు ఈశ్వరమ్మ, సత్యం, ఆర్ఐ నిరంజన్ రావు,డి.టి.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో నేత్రదాన పక్షోత్సవాలు

విశాలాంధ్ర-కొత్తూరు: నేత్ర దానం పక్షోత్సవాలు సందర్భంగా మండలం లో నేత్రదానం పై ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆప్తల్మిస్టు ఇప్పిలి జానకి రామయ్య అన్నారు. 27 తేదీనుండి సెప్టెంబర్ తేది వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, పాఠశాలల్లో విద్యార్థుల కు కళ్ళు తనిఖీలు వివిధ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు. చైతన్య ర్యాలీలు నిర్వహిస్తాం అని ఆప్తాలమిస్టు ఇప్పిలి అన్నారు.

రెవిన్యూ సదస్సులకు సిద్ధం కావాలి

- మీకోసం వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: త్వరలోనే జరగనున్న గ్రామ రెవెన్యూ సదస్సులకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలసి రెవిన్యూ సదస్సులు, డ్వామా, ఓటర్ల జాబితా రూపకల్పన, కోర్టు కేసులు, ఈ పంట, ఇసుక లభ్యత, గృహనిర్మాణం, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్, ఎంపిడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో సున్నితమైన భూ సమస్యలపై రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున సంబంధిత రెవెన్యూ అధికారులు పక్కాగా కార్యాచరణ ప్రణాళికలకు సిద్ధం చేయాలని అన్నారు. ముఖ్యంగా అసైన్డ్ భూములపై మరోసారి సర్వే పూర్తి చేయాలని, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో త్వరలోనే గ్రామాల వారీ తేదీలు ఖరారు చేస్తామని, ప్రతిష్టాత్మక ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. మీ కోసంలో వచ్చిన వినతులలో ఎన్ని పరిష్కరించారు? ఎన్ని వివిధ దశలలో ఉన్నాయో? ప్రతిరోజు సమీక్షించుకోవాలి. రీ ఓపెన్ కేసులు ఒక్కటి కూడా నమోదు కావొద్దని చెప్పారు. పారిశుధ్యం విషయంలో, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అలసత్వం వహిస్తే రాదని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అందిన క్లెయిమ్ లను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసుల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఈ పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకు మాత్రమే సమయం ఉందని, ఈ లోగా పంట వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ పంట నమోదు పూర్తి చేయడంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు వారిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ పంట నమోదు లో 60 శాతం కంటే తక్కువ మండలాలు రానున్న వారంలో పురోగతి సాధించాలని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకత పాటించేలా విధంగా క్షేత్రస్థాయిలో అన్ని విధాలుగా విచారించిన తరువాతే జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈవో ఎం.వెంకటేశ్వరరావు, డీపీవో ఆర్.వెంకట్ రామన్, సీపీవో ప్రసన్న లక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కే.శ్రీధర్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి వాసుదేవరావు, అన్ని మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపి పాలనతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-మందస: భారతీయ జనతా పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ప్రజలు కోసం పని చేస్తుందని, కేంద్రంలో బీజేపి పాలనతోనే దేశాభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం జిల్లా బీజేపి ఉపాధ్యక్షులు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం మందస అన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయ ప్రాంగణంలో మండల బీజేపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పై చర్చించారు. గ్రామాల్లో పార్టీ సభ్యత్వం కోసం పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని కోరారు. మందస మండల బీజేపి అధ్యక్షులు పుచ్చ ఈశ్వరరావు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసే పార్టీ బీజేపి అని, అవినీతి, బంధుప్రీతి లేని పార్టీ బీజేపి అని అన్నారు. కేంద్రంలో బీజేపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. సమావేశంలో గౌరంగ బెహరా, గణేష్ అగారి, తారకేశ్వరరావు రౌలో, ధర్మాన విజయ్, ఏలూరు రాజారావు పార్టీలో చేరగా డి.పున్నయ్య, ఆర్.లక్ష్మణరావు, దేవానంద పట్నాయక్, హడ్డి గౌడులు పాల్గొన్నారు.

అందుబాటులో పాతపట్నం బీజేపీ నాయకులు సిరిపురం

విశాలాంధ్ర - కొత్తూరు : పాతపట్నం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు 28వ తేదీ బుధవారం నుండి అందుబాటులో ఉంటారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గమనించాలని బీజేపి పాత పట్నం కార్యాలయం ఒక ప్రకటన లో తెలిపింది.

ఖాళీగా మందస రెగ్యులర్ తహశీల్దార్ కుర్చీ

విశాలాంధ్ర-మందస: మందస తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దారుగా పని చేసేందుకు ఎవరు సాహించడం లేదు. పాత తహశీల్దార్ తిరుమలబాబు సొంత జిల్లా అయిన విశాఖపట్నంకు బదిలీపై వెళ్లారు. ఆయన బదిలీపై వెళ్లిన తరువాత గత 40 రోజులుగా తహశీల్దార్ పోస్టు ఖాళీగా ఇక్కడ ఉంది. కొత్త తహశీల్దార్‌ను ఎవరిని ఇక్కడ జిల్లా యంత్రాంగం నియమించలేదు. రాష్ట్ర సచివాలయంలో పని చేస్తున్న ఒక ఉద్యోగిని ఇక్కడ డెప్యూటేషన్‌పై నియమించిన ఆయన ఇక్కడ జాయినింగ్ అవడానికి సాహించడం లేదు. శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న తహశీల్దార్లు కూడా ఇక్కడ పని చేసేందుకు ముందుకు రావడ లేదు. కార్యాలయంపై ఏళ్ల తరబడి భూ కబ్జాదారులకు కార్యాలయం ఉద్యోగులు అండగా ఉండడం, ప్రభుత్వ భూములు, సాగునీటి చెరువులు, కాలువలు జిరాయితీగా మార్చడం పంటి పనులు ఎక్కువగా జరుగుతుండడం కార్యాలయంలోని ఫైల్లు తారుమారు చేయడం వంటి దందాలు ఉండడంతో కార్యాలయంపై చెడు అభిప్రాయం ఉంది. ఈ కార్యాలయం పరిధిలో తరుచు భూ వివాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో ఇక్కడ ప్రజా సమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. రెవిన్యూ కార్యాలయం పరంగా ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

అసభ్యకర ప్రవర్తనపై వివాహిత ఫిర్యాదు

విశాలాంధ్ర-కొత్తూరు : మండలంలోని బమ్మిడి గ్రామానికి చెందిన చింతాడ విజయ్ అనే వ్యక్తి తనపై అసభ్యకరంగా ప్రవర్తించాడని అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళ మండల ధనలక్ష్మి కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె చేసిన ఫిర్యాదు పై కొత్తూరు పోలీసులు సోమవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో కేసు నమోదు చేశారు. మంగళవారం స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ అహమ్మద్ బమ్మిడి గ్రామం వెళ్లి సంఘటన పరిస్థితి పై విచారణ చేపట్టారు.

రాష్ట్రవ్యాప్తంగా వినిపించే విధంగా అందరం కలిసికట్టుగా సభ్యత్వం చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి: స్థానిక బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గూనా మీనా కుమార్ అధ్యక్షతన మండల సభ్యత్వ కార్యక్రమ కర్మశాల ఏర్పాటు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇంచార్జ్ గా బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరే నరేంద్ర చక్రవర్తి విచ్చేసి ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024 కార్యశాల జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసి ఇప్పుడు మండల స్థాయిలో కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. ప్రపంచంలోనే భారతీయ జనతా పార్టీ సభ్యత్వంలో మొదటి స్థానంలో ఉంటూ అతి పెద్ద పార్టీగా అవతరించిందని, మరల సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సభ్యత్వ నమోదులో అందరూ ఒక ప్రణాళిక బద్ధంగా సభ్యత్వం చేసినట్లయితే ఒక పెద్ద మొత్తంలో నమోదు చేయవచ్చునీ, అదేవిధంగా మన జిల్లాలో టెక్కలి నియోజకవర్గంలో కూడా అధిక మొత్తంలో సభ్యత్వం చేసే టెక్కలి నియోజకవర్గ సభ్యత్వాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినిపించే విధంగా అందరం కలిసికట్టుగా సభ్యత్వం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ కో కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, టెక్కలి మండల ప్రధాన కార్యదర్శి జర్జన రాంజీ, శాసనపురి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా ఉప అధ్యక్షులు కామేశ్వర్ రెడ్డి, స్వచ్ఛభారత్ కన్వీనర్ లింగరాజు, యువ మోర్చా మండల నాయకులు యోగి, మల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

గురుగుబెల్లికి నేషనల్ సేవారత్న అవార్డు

విశాలాంధ్ర-పలాస: డాక్టర్ గురుగుబెల్లి రామ్మోహనరావుకు విశాఖ పబ్లిక్ హాల్‌లో సోమవారం రాత్రి చేయూత సోషల్ సర్వీసు ఆర్గనైజర్ ఆధ్వర్యంలో ఎం.పి.జె అబ్దుల్ కలాం నేషనల్ సేవా రత్న అవార్డును ముఖ్యఅతిథి డాక్టర్ జి.దామోదరరావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్రైట్ ఫ్రింగ్ నేషనల్ యూనివర్సిటీ ఎ.ఎస్.ఎ, ఇండియా, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ అమ్మి జెమ్స్ పౌండర్, డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్.చిన్నారావు, స్నూ మా సిని డైరెక్టర్ గుప్తా పాల్గొన్నారు.

వేధింపులపై విద్యార్థినీలు ధైర్యంగా ఎదుర్కోవాలి

విశాలాంధ్ర-పలాస : పాఠశాలలో కాని, ఇతర ప్రాంతాల్లో కాని విద్యార్థినీలకు ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వారిపై ధైర్యంగా ఎదుర్కోవాలని కాశీబుగ్గ ఎస్.ఐ రేణుకాదేవి విద్యార్థినీలకు సూచించారు. మంగళవారం కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అదే విధంగా నేటి బాలలే రేపటి పౌరులు కావాలని విద్యార్థినీలు అన్నారు. ఎప్పుడైనా వేధింపులకు గురైతే తక్షణమే వేధింపులకు గురి చేసిన వ్యక్తిపై తిరుగుబాటు చేయాలని అంతేకాకుండా వేధింపులపై పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు, ఇంటి వద్ద తల్లిదండ్రులకు తక్షణమే తెలియజేయాలని, పోలీసులు దృష్టికి తీసుకొని వచ్చినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ఆ విధంగా ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన చేసుకోవాలన్నారు. అలాగే ఎంపిడివో ఎన్.రమేష్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థులు భోజనాలకు ముందు తరువాత చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. అదే విధంగా పరిసరాలను కూడా శుభ్రపరుచుకోవటం రోగాలు బారిన పడకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం. చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంబాన రామారావు మృతి ఉద్యమాలకు తీరని లోటు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మొదటి తరం నాయకుడు, రెండు దశాబ్దాలకు పైగా అంకితభావంతో, నిబద్ధతతో జాతి కోసం శ్రమించిన నేత నంబాన రామారావు మృతి ఉద్యమాలకు తీరని లోటని ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. జిల్లాకు చెందిన రామారావు అనారోగ్యం తో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తపరుస్తూ మందకృష్ణ మాదిగ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ గ్రామస్థాయి అధ్యక్షునిగా, నియోజకవర్గ అధ్యక్షులుగా, శ్రీకాకుళం జిల్లా యువసేన అధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శిగా , ఒడిస్సా ఇన్చార్జిగా వివిధ హోదాల్లో పని చేశారని ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో ఆయన ప్రతి అడుగు కీలకమని, ఇలాంటి నేతను కోల్పోవడం బాధాకరమని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పోరాట విజయాన్ని మద్దతి నేపథ్యంలో రామారావు మృతి విచారకరమని యావత్ మాదిగ జాతి తరపున నివాళులు తెలుపుతున్నట్లు తెలిపారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరుస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రక్తదానంలో మేటి పవన్ పుత్ర సేవా సంస్థ

విశాలాంధ్ర-మందస : రక్తదానం చేయడంలో పవన్ పుత్ర సేవా సంస్థ మేటిగా నిలుస్తుంది. అత్యవసర సమయంలో ఏ రోగికైనా రక్తం అవసరమైనప్పుడు ఈ సంస్థను సంప్రదించిన వెంటనే గ్రూప్ సభ్యులు రక్తం దానం చేసేందుకు ముందుకు వస్తారు. దీనిలో భాగంగా మంగళవారం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన టెంక రుకుమ్మ అనే మహిళకు అనారోగ్యం కారణంగా బి. పాజిటివ్ రక్తం అవసరం కాగా పవనపుత్ర సేవా సంస్థ సభ్యుడు గ్రామానికి చెందిన టెంక నవీన్ సహాయంతో అదే గ్రామానికి చెందిన మెట్టూరు కృష్ణారావు వెళ్లి సోంపేటలోని ఉద్దానం బ్లడ్ బ్యాంకులో బి.పాజిటివ్ రక్తం దానం చేశారు . సంస్థ సభ్యులు ప్రతి ఒక్కరు అవసరమైన సమయంలో స్వచ్ఛందంగా వెళ్లి రక్త దానం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు.రక్తం అవసరమైన వారు శ్రీపవనపుత్ర సేవా సంస్థ 8985801148 కు సంప్రదించాలని కోరారు.

జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన పలువురు సీఐ, ఎస్ఐలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాద రావు, నరసన్నపేట పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సి. హెచ్.దుర్గ ప్రసాద్, సారవకోట పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి.అనిల్ కుమార్, మందస పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.కె.ఖాదర్ భాష, ఇచ్ఛాపురం రూరల్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, బ్లడ్ సబ్‌ఇన్స్పెక్టర్ ఎమ్.ప్రవల్లిక మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి, వారిని మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల సీఐ,ఎస్ఐలకు దిశా నిర్దేశం చేసి,నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన పోలీస్ సేవలు ప్రజలకు అందించాలని, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

అంబేడ్కర్ గురుకులంలో 30న మిగులు సీట్ల భర్తీకి పరీక్ష

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 30న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 2, 6వ తరగతిలో 3, ఏనిమిదిలో 2, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 11, బైపీసీలో రెండు ఎస్సీ కేటగిరీలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఐదో తరగతిలో మార్కుల ఆధారంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్లు కేటాయిస్తామన్నారు. మిగిలిన వాటికి పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు, అవసరమైన సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం అల్లినగరం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇదే మండలం పట్నుశాలిపేటకు చెందిన లావేటి కృష్ణారావు (45) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు తన మిత్రుడు లావేరు మండలం సిగడిపేటకు చెందిన మెండ సూర్యనారాయణతో కలిసి మోటారు బైక్ తో చిలకపాలెం నుంచి అరిణాం అక్కివలస వైపు వెళ్తుండగా.. టిప్పర్ లారీ ఢీకొంది. ఈ సంఘటనలో మోటారు బైక్ నడుపుతున్న కృష్ణారావు అక్కడికక్కడే మృతిచెందగా, సూర్యనారాయణ గాయాలతో బయటపడ్డారు. మృతునికి భార్య రాధ, కుమార్తె సాయి గౌరి, కుమారుడు చరణ్ ఉన్నారు. మృతుడు శ్యాంపిస్టన్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాల ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకం సహస్రనామార్చన, ఊంజలసేవను వేదమంత్రాలు సాక్షిగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించి ప్రసాదాన్ని పంచిపెట్టారు. పలువురు పిల్లలు శ్రీకృష్ణుని వేషధారణతో అందరిని ఆకట్టుకున్నారు. కొత్తగా నేరుకున్న మహిళలు కోలాటం ప్రదర్శన చేశారు.అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చెలికాని వెంకట గోపాలకృష్ణ భారతీదంపతులతో పాటు పెద్దఎత్తున, భక్తులు, మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

ఆటలు క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తా

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలలో "ఫిట్ ఇండియా" కార్యక్రమంలో భాగం గంట "ప్రతిజ్ఞ"ను నిర్వహించారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్పర్సన్ / ప్రధానోపాధ్యాయుడు/ దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు /సక్షం జిల్లా కన్వీనర్/సిస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్/సామాజిక నేత్ర/ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.డా.ఎం.కె.మిత్రో. ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మోహిని పవడ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దా.మిత్రో మాట్లాడుతూ ఆటలు క్రీడలు మానసిక శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, కావున వాటిపై శ్రద్ధవహించాలన్నారు.

రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తాం : టీడీపీ

విశాలాంధ్ర-కొత్తూరు : అలికాం కొత్తూరు ఆర్ అండ్ బి రోడ్డులో కొత్తూరు బీసీ హాస్టల్ సమీపంలో రోడ్ పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు సమస్యను స్థానిక ఎంఎల్ఏ మామిడి గోవిందరావు కు వివరించనున్నట్లు మండల టీడీపీ పూర్వ అధ్యక్షులు మాతల గాంధీ మీడియాకు తెలిపారు. రోడ్డు కు ఇరువైపులా డ్రైనేజ్ లు లేకపోవడం రోడ్డు పై వర్షం నీరు ఏటు వెళ్లలేకపోవడంతో గుంతలుగా మారాయని గాంధీ అన్నారు. అదేవిధంగా కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో డ్రైనేజ్ సిస్టమ్ బాగులేకపోవడంవల్ల బత్తిలి వైపు పాతకుండ వైపు కూడా ఆర్ అండ్ బి రోడ్డుపై వర్షం నీరు ఏటు కదలకపోవడంతో రోజులు తరబడి రెండు అడుగుల నీటిలో నడక వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి ఈ సమస్య పరిష్కారం కోసం ఎంఎల్ఏ మామిడి గోవిందరావుకు విన్నవించామని టీడీపీ నాయకులు తెలిపారు.

యుటిఎఫ్ సర్వోత్సవ గోడపత్రికలు విడుదల

విశాలాంధ్ర-సీతానగరం : మండల విద్యా వనరుల కేంద్రంవద్ద అక్టోబర్ 20,21, తేదీలలో జరుగు యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని యుటిఎఫ్ మండల నాయకత్వం ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించింది. మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరుగు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, కొత్త ప్రసాదరావు జిల్లా కౌన్సిల్ సభ్యుడు మర్రాపు గోవిందరావు మండల కార్యవర్గ సభ్యులు బూరాడ ఆదినారాయణ, ఆది వెన్నెల శంకరరావు, కునుకు మురళి, నాగులకొండ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల వివరాలు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు అందజేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు జ్వరాల వివరాలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా కె విజయ పార్వతి అన్నారు. మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. జిల్లాలోగల ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదయ్యే సాధారణ జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, చికన్ గునియా, ఇతర జ్వరాల సమాచారం తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి తెలియపరచాలని ఆమె స్పష్టం చేశారు. ఆసుపత్రులలో జరిగే ప్రసవాలు, అబార్షన్లు, కుక్క, పాము కాట్లతో పాటుగా నమోదవుతున్న అన్ని కేసుల వివరాలు అందజేయాలని ఆమె పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమాచారం కూడా అందించాలని, అందించని ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అన్ని ఆసుపత్రులు పి-ఫారం తప్పనిసరిగా ప్రతిరోజు సమర్పించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మలేరియా, డెంగ్యూ, ఇతర జ్వరాలు సరిపడా మందులు ఉన్నాయని, జ్వరాల పరిస్థితి అదుపులోనే ఉందని, డెంగ్యూ నిర్ధారణ చేయడానికి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, పాలకొండ ఏరియా ఆసుపత్రి సెంటినెల్ సైట్ హాస్పిటల్స్ గా గుర్తింపు పొందాయని, కేవలం ఈ రెండు ఆసుపత్రులలో మాత్రమే డెంగ్యూ నిర్ధారణ చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో గల అన్ని ప్రైవేటు ఆసుపత్రులకు, ల్యాబ్ లకు సర్క్యులర్ జారీ చేశామన్నారు.